RNI No.: TELTEL/2023/90269

# తెలంగాణ షాన్

ప్రతి పదం ప్రజల పక్షం

తెలుగు దిన పత్రిక

# TELANGANA SHAAN

Telugu Daily

విలేకరులు కావలెను

తెలంగాణ షాన్

తెలుగు దినపత్రిక

నందు రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు
నియోజకవర్గ ఇన్చార్జ్‌లు
మండలాల వారిగా విలేకరులు కావలెను

ఆసక్తి గల యువతీ యువకులు

సంప్రదించవలసిన మొబైల్ నెంబర్: 99637 08331

| Malkajgiri | Volume: 3 Issue: 91 | Tuesday, July 15, 2025 | Editor: RAMANCHARLA SRIKANTH | Pages: 4 | Rs. 4/- |
|---|---|---|---|---|---|
| మల్కాజిగిరి | సంపుటి : 3 సంచిక : 91 | మంగళవారం, జూలై 15, 2025 | ఎడిటర్: రామన్‌చర్ల శ్రీకాంత్ | పేజీలు : 4 | వెల : రూ.4/- |

## కాంగ్రెస్ సర్కార్ అంటేనే కర్షకుల ప్రభుత్వం : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**ఖమ్మం:** కాంగ్రెస్ సర్కార్ అంటేనే కర్షకుల ప్రభుత్వం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లాలో పాలేరు జలాశయం నుంచి సాగర్ ఆయకట్టుకు సోమవారం భట్టి విక్రమార్కతోపాటు రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే.. వ్యవసాయం, కరెంటు, ప్రాజెక్టులు అని అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను కాపాడలేదని విమర్శించారు. ఏపీ ప్రభుత్వం ప్రాజెక్టులు కడుతుంటే.. కేసీఆర్ పట్టించుకోలేదన్నారు. ఆనాడు తప్పిదాలు చేసిందే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు అని ఆరోపించారు. తప్పులు చేసిన భారత రాష్ట్ర సమితి నేతలు ఇప్పుడు తమపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.
కేసీఆర్ పాలనలో చేసిన తప్పిదాలకు తమ ప్రభుత్వం మూల్యం చెల్లిస్తోందని భట్టి అన్నారు. గతంలో శ్రీశైలంపైన ఏపీ ప్రభుత్వం ప్రాజెక్ట్‌లు కడుతుంటే అడ్డుకోకుండా కేసీఆర్ ప్రభుత్వం సహకరించిందని మండిపడ్డారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడుతూ . తమ ప్రభుత్వంలో వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసి కాపాడుకుంటామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయం, రైతులకు అండగా నిలిచిందని చెప్పారు. ఆనాడు కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రాజెక్ట్‌ల నిర్మాణానికి వ్యతిరేకంగా పోరాటాలు చేశామని గుర్తుచేశారు. ఆనాడు కేసీఆర్, హరీష్‌రావు, కేటీఆర్ తప్పులు చేసి వాటిని ఇప్పుడు తమపై రుద్దాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా రైతు పథకాలు అమలు చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ , సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రైతు భరోసా ద్వారా రైతులకు ఎకరాకు రూ.12 వేలు అందించామని గుర్తు చేశారు. వారి ఖాతాల్లో 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు జమ చేశామన్నారు. సన్నధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో మిగిలిన పంటలకు కూడా ఇస్తామని చెప్పారు.
రాష్ట్రంలో 2,55,324 లక్షల ఎకరాలకు సాగునీటిని విడుదల చేశామని మంత్రి పొంగులేటి తెలిపారు. గత ఏడాది కనీవినీ ఎరుగని వరదల కారణంగా సాగర్ మెయిన్ కెనాల్ పూర్తిగా కొట్టుకుపోయిందని.. దానిని పునరుద్ధరించామని తెలిపారు. నాగార్జున సాగర్ ఆయకట్టుకు పూర్తి స్థాయిలో సాగునీరు విడుదల చేస్తామని స్పష్టం చేశారు. కృష్ణా బేసిన్‌లో వచ్చే నీటితో మొదటి పంటకు ఎలాంటి ఢోకా లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వరుణ దేవుడి అండ ఉందని.. ఇది శుభసూచకమని అన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పచేసినా.. తమ ప్రభుత్వంలో రైతులకు అండగా నిలబడ్డామని చెప్పారు. కూసుమంచి మండలం పాలేరు రిజర్వాయర్ నుంచి సాగర్ నీటిని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నేడు విడుదల చేశారు. జిల్లాలో 2.50లక్షల ఎకరాలకు పాలేరు రిజర్వాయర్ నుంచి 1500 క్యూసెక్కుల సాగు నీటిని రెండో జోనుకు మంత్రులు విడుదల చేశారు.

## ‘శ్రీమద్భాగవతం’ టివి సీరియల్ షూటింగ్ హాజరైన రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ :** ఫిల్మ్ సిటీలో శ్రీమద్భాగవతం చిత్రీకరణ తెలంగాణకు గర్వకారణమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రామోజీ ఫిల్మ్ సిటీని ఎంతో అద్భుతంగా నిర్మించారని ప్రశంసించారు. తాను యూనివర్సల్ స్టూడియోను చూడలేదని, కానీ రామోజీ ఫిల్మ్ సిటీ మాత్రం దేశంలోనే ప్రత్యేకమైన స్టూడియో అని కొనియాడారు. రామోజీ ఫిల్మ్ సిటీలో ‘శ్రీమద్భాగవతం–పార్ట్ 1’ చిత్రీకరణ ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. సాగర్ పిక్చర్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రామాయణం, మహాభారతం మన జీవితాల్లో భాగమని వ్యాఖ్యానించారు. రామోజీ ఫిల్మ్ సిటీ తెలంగాణలో ఉందని చెప్పడానికి గర్విస్తున్నామని ఆయన పేర్కొన్నారు. నలభై ఏళ్ల క్రితం రామాయణం సీరియల్ అందరికీ చేరువైందని, కరోనా సమయంలో మళ్లీ ఆ సీరియల్‌ను టెలికాస్ట్ చేస్తే ప్రపంచ రికార్డు సృష్టించిందని గుర్తు చేశారు. 2035 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని సంకల్పించామని ముఖ్యమంత్రి అన్నారు. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఇందుకోసం విజన్ 2047 డాక్యుమెంట్ సిద్ధం చేసుకున్నామని, అందులో సినిమా రంగానికి ప్రత్యేక అధ్యాయం ఉందని వెల్లడించారు. రామానంద్ సాగర్ నాడు తీసిన ‘రామాయణం’ సీరియల్ ఎంతటి విజయం సాధించిందో, ఇప్పుడు శ్రీమద్భాగవతం కూడా అంతే విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ ప్రసాద కుమార్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సరోజా దేవి మృతి.. రేవంత్, పవన్ కల్యాణ్ సంతాపం



**హైదరాబాద్ :** ప్రముఖ నటి, పద్మభూషణ్ గ్రహీత బి.సరోజా దేవి మరణం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర సంతాపం ప్రకటించారు. చలనచిత్ర రంగంలో ముఖ్యంగా తెలుగు, కన్నడ, తమిళ సినిమాల్లో మరిచిపోలేని అనేక పాత్రలు పోషించారని గుర్తుచేసుకున్నారు. చలనచిత్ర రంగంలో వారు లేని లోటు పూడ్చలేనిదని, సరోజాదేవి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

**చిత్రసీమపై బి సరోజది చెరగని ముద్ర – పవన్ కల్యాణ్**

చలనచిత్ర రంగంలో బి సరోజది చెరగని ముద్ర అంటూ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తన సంతాప సందేశంలో పేర్కొన్నారు.. ఆమె కన్నుమూశారని తెలిసి బాధపడ్డానని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాని పేర్కొన్నారు. 1955 నుంచి దాదాపు మూడు దశాబ్దాల పాటు తెలుగు, కన్నడ, తమిళ భాషా చిత్రాల్లో నటించి చిత్రసీమపై తనదైన ముద్రను వేశారన్ని తెలిపారు. భూకైలాస్, పాండురంగ మహత్యం, సీతారామ కళ్యాణం, జగదేకవీరుని కథ, శకుంతల, దానవీర శూర కర్ణ, ఆత్మబలం లాంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను మెప్పించిన విషయాన్ని పవన్ గుర్తు చేసుకున్నారు. ఆమె మృతికి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

## ఆ బిల్లును కేంద్రం ఎందుకు ఆమోదించటం లేదు? పొన్నం



**హైదరాబాద్:** కేంద్రనాయకత్వాన్ని ఒప్పించాల్సిన బాధ్యత రాష్ట్ర బిజెపి నేతలపై ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కోర్టు ఆదేశాలను దృష్టిలో ఉంచుకుని కులగణన కూడా నిర్వహించామని అన్నారు. ఈ సందర్భంగా గాంధీభవన్ లో పొన్నం మీడియాతో మాట్లాడుతూ.. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను బిజెపి నేతలు వ్యతిరేకిస్తున్నారా? అని బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును కేంద్రం ఎందుకు ఆమోదించటం లేదు? అని ప్రశ్నించారు. రాష్ట్రపతితో ఆమోదింపచేసి..9వ షెడ్యూల్ లో చేర్పించాలని అన్నారు. రాష్ట్ర మంత్రివర్గం లేదా అఖిలపక్షం ఢిల్లీకి వచ్చేందుకు సిద్ధంగా ఉందని తెలియజేశారు. బిఆర్‌ఎస్ బిజెపిలో ఉన్న బిసి నేతలు వాళ్ల అధిష్టానంపై ఒత్తిడి పెంచాలని, బిసిల రిజర్వేషన్లకు అడ్డుపడే పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని డిమాండ్ చేశారు. బిసిల రిజర్వేషన్లపై బిజెపి నేతలు మొసలికన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో కులగణన చూసిన తర్వాతే కేంద్రం కళ్లు తెరచిందని, తెలంగాణ ఒత్తిడితోనే కేంద్రం జనగణనతో పాటు కులగణనను ప్రకటించిందని పేర్కొన్నారు. బిఆర్‌ఎస్ అధ్యక్ష పదవి బిసిలకు ఎందుకు ఇవ్వరు? అని పొన్నం నిలదీశారు. వీలైతే మంచి సలహా ఇవ్వండని.. రిజర్వేషన్లకు అడ్డుపడొద్దని సూచించారు. బిఆర్‌ఎస్, బిజెపి నేతలు ఒకేలా మాట్లాడుతున్నారని, రిజర్వేషన్లపై ఏమైనా అనుమానం ఉంటే చెప్పండని అన్నారు. రిజర్వేషన్ల ప్రక్రియకు అడ్డుపడితే సహించేది లేదని పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు.

## కాంగ్రెస్ పాలనలో కాలువల్లో నీళ్లకు బదులు రైతుల కన్నీళ్లు : కెటిఆర్

**హైదరాబాద్ :** కాళేశ్వరం నీళ్లను ఎత్తిపోయకుండా చేసిన సర్కార్ నిర్లక్ష్యం వల్ల కాలువల్లో నీళ్లకు బదులు రైతుల కన్నీళ్లు పారుతున్నాయని మండిపడ్డారు బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ . ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో వ్యవసాయాన్ని దండగ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ పాలనలో వచ్చిన నీళ్లు.. కాంగ్రెస్ పాలనలో ఎందుకు రావడం లేదని రైతులే ప్రశ్నిస్తున్నారన్నారు. రైతులకు కోసం బీఆర్‌ఎస్ నిరంతరం పోరాడుతుందని కేటీఆర్ ట్వీట్ చేశారు. ‘కాలం కాటేయడం లేదు.. కాంగ్రెస్ ప్రభుత్వం కాటేస్తున్నది. కరువు కాటేయడం లేదు.. కాలువల్లో నీళ్లు వారించకుండా కాంగ్రెస్ కాటేస్తున్నది. కాళేశ్వరం నీళ్లను ఎత్తిపోయకుండా కక్షగట్టిన సర్కార్ నిర్లక్ష్యం మూలంగా కాలువల్లో నీళ్లకు బదులు రైతుల కన్నీళ్లు పారుతున్నాయి. అద్దాలమేడలో ఊరేగుతున్న అబద్దాల కాంగ్రెస్ మూలంగా అంధకారంలో తెలంగాణ రైతన్న ఆందోళన చెందుతున్నాడు. దశాబ్దాల పాలనలో దండగ చేసిన వ్యవసాయాన్ని దశాబ్ద బీఆర్‌ఎస్ పాలనలో పండగ చేస్తే .. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో తిరిగి దండగ చేశారు. కానీ పండగల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఊరేగుతున్నది. బీఆర్‌ఎస్ పాలనలో వచ్చిన కాళేశ్వరం నీళ్లు.. కాంగ్రెస్ పాలనలో ఎందుకు రావడం లేదని రైతన్నలు ప్రశ్నిస్తున్నారు. దాదాపు ఆరువందల మీటర్ల ఎత్తున ఎగిసిన కాళేశ్వరం నీళ్లు సుమారు 450 కిలోమీటర్ల దూరం ప్రయాణించి సూర్యాపేట జిల్లాలోని పెన్‌పహాడ్ మండలంలో రావిచెరువు వరకు చేరి రైతుల పొలాలను తడిపిన నీళ్లు నేడెందుకు పారడం లేదని రైతన్నలు ప్రశ్నిస్తున్నారు. శ్రీరాంసాగర్ కింద 2001లో పూర్తయిన కాకతీయ వరద కాలువ 22 ఏళ్ల తర్వాత కాళేశ్వరం ఎత్తిపోతల



మూలంగా 153 కిలోమీటర్లు ప్రయాణించి చివరి ఆయకట్టుకు చేరాయి. కానీ నేడు మేడిగడ్డ మరమ్మతులు చేయకుండా, కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీళ్లు ఎత్తిపోసి సాగునీరు ఇచ్చే అవకాశం ఉన్నా, కాంగ్రెస్ సర్కార్ ఉద్దేశపూర్వక నిర్లక్ష్యంతో అటువైపు కన్నెత్తి చూడడం లేదు. వ్యవసాయంపై కక్షగట్టిన కాంగ్రెస్ సర్కార్ రైతన్నలకు శిక్ష వేస్తున్నది. కాంగ్రెస్ కుట్రలను ఛేదిస్తాం. తెలంగాణ రైతన్నలను కాపాడుకునేందుకు నిరంతరం పోరాడతాం’ అంటూ కేటీఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## తెలంగాణలో బీజేపీతోనే స్వర్ణయుగం సాధ్యం కమలం స్టేట్ చీఫ్ రామచంద్రరావు

**హైదరాబాద్:** బీజేపీ ప్రభుత్వం మాత్రమే తెలంగాణలో స్వర్ణయుగం తెస్తుందని, తెలంగాణలో బీజేపీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు కార్యకర్తలు విజయ సంకల్పం తీసుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు పిలుపునిచ్చారు. ఉమ్మడి నల్గొండ జిల్లా చౌటుప్పల్ కు వచ్చిన ఆయనకు పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికాయి. అనంతరం నిర్వహించిన సన్మాన సభలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, విద్యార్థులు రీయింబర్స్‌మెంట్ విడుదల కాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ను ఎందుకు ఎన్నుకున్నామని ప్రజలు బాధపడుతున్నారని చెప్పారు.

**డబుల్ ఇంజిన్ సర్కార్‌తో అభివృద్ధి సాధ్యం**

డబుల్ ఇంజిన్ సర్కార్‌తో తెలంగాణ అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని రామచందర్ అన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవినీతిమయమైందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన



హామీలను అమలు చేయకుండా ప్రజలను ఇబ్బందులకు పెడుతోందన్నారు. తెలంగాణ ప్రజలు ఈ రెండు పార్టీలకు ప్రత్యామ్నాయంగా బీజేపీ వైపు చూస్తున్నారన్నారు.

తెలంగాణ షాన్

## సంపాదకీయం

# బీదలు ఓ వైపు బిలియనీర్లు మరోవైపు

దేశ సంపద వికేంద్రీకరణ జరగకుండా కేంద్రీకృతం కావటంతో పేదల, ధనికుల వ్యత్యాసం తీవ్రంగా పెరుగుతూ ఉంది. కొద్ది మంది కోటీశ్వరుల వద్ద సంపద, కొద్ది మంది భూకామందుల వద్ద సాగు భూములు ఉండటంతో, సంపదలు సృష్టించే అత్యధిక మంది గ్రామీణ పేదలు, కార్మికులు , శ్రామికులు సంపదకు దూరంగా ఉన్నారు. పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న బడా పెట్టుబడిదారుల, బడా భూస్వాముల అనుకూల విధానాలే అందుకు కారణంగా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా పేదల సంఖ్య విషయంపై వేర్వేరుగా అనేక నివేదికలు, అంచనాలు ఉన్నాయి. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం 80 కోట్ల, 80 లక్షల మంది తీవ్ర పేదరికంలో ఉన్నారు. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం 101 కోట్ల మంది తీవ్ర పేదరికంలో ఉన్నారు. ఈ 101 కోట్ల పేదల్లో సగం మంది 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలు కాగా, 13.5 శాతం మంది పిల్లలు 18 ఏళ్ల పైబడిన వారు ఉన్నారు. సగం మంది పేదలు పోషకాహార లోపంతో జీవిస్తున్నారు. 83.7% మంది పేదలు గ్రామీణ ప్రాంతంలో నివసిస్తున్నారని ఐక్య రాజ్య సమితి నివేదిక పేర్కొంది. మొత్తం గ్రామీణ జనాభాలో 28% మంది తీవ్ర పేదరికంలో ఉన్నారు. అనేక దేశాల్లో పేదలు ఎక్కువగానే ఉన్నారు. ఇండోనేషియాలో 4 కోట్ల, 70 లక్షల పేదరికంలో ఉన్నారు. ఆ దేశ జనాభాలో ఇది 18% కాగా, అత్యధిక పేదలు ఉన్న దేశాల్లో 5వ స్థానంలో ఉంది. పాకిస్తాన్‌లో 5 కోట్ల, 90 మంది ప్రజలు పేదరికంలో ఉండి, ఆ దేశ జనాభాలో 29% గా ఉన్నారు. అధిక పేదలు ఉన్న దేశాల్లో 4వ స్థానంలో ఉంది. ఆఫ్రికా దేశం నైజీరియాలో 8 కోట్ల, 60 లక్షల మందితో, పేదరికపరంగా 3వ స్థానంలో ఉంది. పేదలు, పేదరికంలో ఉన్న దేశాలు సబ్ సహారా ఆఫ్రికా, దక్షిణాసియాలో ఉన్నాయి. చైనాలో పేదరికం నేడు తక్కువగా ఉంది. 2020లో 5 కోట్ల, 60 లక్షల మంది ఆ దేశ పేదరిక రేటుకు దిగువన ఉన్నారు. దేశ జనాభాలో 1.7 శాతంగా ఉంది. 2025 లో ప్రపంచ బ్యాంకు లెక్కల ప్రకారం పేదరికం 0.7%గా ఉంది. ప్రస్తుతం పేదల సంఖ్య ఎంత అనేది అందుబాటులో లేదు. చైనాలో కూడా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయ వ్యత్యాసాలు ఉన్నాయి. అమెరికాలో కూడా 2022 సంవత్సరంలో 12.4% పేదల లెక్క బయటపడింది. ఇంకా ఇతర పెట్టుబడిదారీ దేశాల్లోనూ పేదలు గణనీయంగానే ఉన్నారు. భారతదేశంలో 201112 సంవత్సరంలో పేదరికం 27.1% (34.4 కోట్లు)గా ఉంటే, 2022- 23 నాటికి 5.3% (7.5 కోట్లకు) తగ్గిందని మోడీ ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది. పేదరికం శాతం తగ్గినా, దేశ ప్రజల్లో 22% మంది పేదరికంలో జీవిస్తున్నారు. ప్రపంచ బ్యాంక్ తాజా నివేదిక ప్రకారం దేశంలో 35 కోట్ల మంది కనీస అవసరాలు తీర్చుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారు. మోడీ ప్రభుత్వం చెప్పినట్లుగా పేదరికం తగ్గితే 80 కోట్ల మందికి రేషన్ బియ్యం సప్లయ్ చేయటం ఎందుకు? భారతదేశంలో పేదరిక అంచనాపై అనేక మంది భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. దేశంలో దారిద్ర్యరేఖను అంచనా వేయటం, పేదరిక గురించి అనేక కమిటీలు చేసిన నిర్ధారణలు కూడా హాస్యాస్పదంగాను, పేదరికాన్ని అపహాస్యం చేసేవిగా ఉన్నాయి. అమెరికాలో నలుగురు కుటుంబానికి రోజుకి 63 డాలర్ల కన్నా తక్కువ ఆదాయం ఉంటే పేదలుగా పరిగణిస్తారు. భారతదేశంలో అర డాలర్ కన్నా ఎక్కువ సంపాదించే వారిని పేదలుగా గుర్తించటంలేదు. ప్రపంచ బ్యాంక్ మాత్రం భారత్‌లో 2.3 డాలర్ల కన్నా తక్కువ ఆదాయం ఉన్న వారిని పేదలుగా గుర్తించింది. భారతదేశంలో క్షేత్రస్థాయిలో పేదరికాన్ని అధ్యయనం చేస్తే కేంద్ర ప్రభుత్వం, ప్రపంచ బ్యాంక్, ఐక్య రాజ్య సమితి చెప్పిన లెక్కలన్నీ తలకిందులు అవుతాయి. ప్రపంచ దేశాల్లో పేదరికం పెరుగుతూ ఉంటే, మరో వైపు బిలియనీర్లు పెరుగుతూ వస్తున్నారు. 2025 నాటికి ప్రపంచ బిలియనీర్ల సంఖ్య 3,030 చేరుకుంది. వారి మొత్తం సంపద 12 లక్షల కోట్ల అమెరికా డాలర్లుగా అంచనాగా ఉంది. ప్రపంచంలో అత్యంత సంపన్నుల జాబితాలో ఎలెన్ మస్క్ అగ్రస్థానంలో ఉన్నాడు. అతని నికర ఆస్తి 377 బిలియన్ (30 లక్షల, 60 వేల కోట్ల రూపాయలు) డాలర్లు. అతని తర్వాత మార్క్ జుకర్ బర్గ్ ఆస్తి 235 బిలియన్ డాలర్లు, జెఫ్ బెజోస్ 227 బిలియన్ డాలర్లతో మూడవ స్థానంలో ఉన్నాడు. వీరు గాక లారీ ఎల్లిసన్ 194 బిలియన్ డాలర్లు, బిల్ గేట్స్ 176 బిలియన్ డాలర్లు, స్టీవ్ బాల్మెర్ 160 బిలియన్ డాలర్లతో ఉన్నారు. భారతదేశంలో 2024లో 191 మంది బిలియనీర్లు ఉంటే, 2025లో వీరి సంఖ్య 284కు చేరింది. బిలియనీర్లలో ప్రపంచంలో మూడవ స్థానంలో ఉంది. 2015 నుండి భారతదేశంలో బిలియనీర్ల అదనంగా 123 మంది పెరిగారు.ముఖేష్ అంబానీ 8 లక్షల, 60 వేల (8.6 ట్రిలియన్ రూపాయలు. ఒక ట్రిలియన్ లక్ష కోట్లు) కోట్ల రూపాయలతో ప్రథమ స్థానంలో ఉంటే, ఆ తర్వాత గౌతమ్ అదానీ 8 లక్షల, 40 (8.4 ట్రిలియన్ల రూపాయలు) వేల కోట్ల రూపాయలతో రెండవ స్థానంలో ఉన్నాడు. ఆ తర్వాత రోష్నినాడర్ ( హెచ్‌సిఎల్ టెక్నాలజీ) 3.5 లక్షల కోట్లు, దిలీప్ షాంఘ్వీ (సన్ ఫార్మా) 2.5 లక్షల కోట్లు, అజీమ్ ప్రేమ్ జీ ( విప్రో) 2.2 లక్షల కోట్లు, కుమార్ మంగళం బిర్లా (ఆదిత్య బిర్లా గ్రూప్) రెండు లక్షల కోట్లు, సైరస్ పూని వల్లా (సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా) 2 లక్షల కోట్ల రూపాయలు, సిరాజ్ (బజాజ్ ఆటో) 1.6 లక్షల కోట్లు, రాధా కిషన్ దమానీ (అవెన్యూ సూపర్ మార్ట్) 4.4 లక్షల కోట్ల రూపాయల సంపద కలిగి ఉన్నారు. భారత బిలియనీర్ల సగటు వార్షిక సంపద 34,514 కోట్లు. దేశంలో వెయ్యి కోట్లు సంపద కలిగి ఉన్న వారి సంఖ్య 1,539 మంది ఉంటే, అందులో 5 వేల కోట్ల సంపద కలిగిన వారు 534 మంది ఉన్నారు. నల్లధనాన్ని పరిగణనలోకి తీసుకుంటే వీరి సంఖ్య ఇంకా ఎక్కువగా ఉంటుంది. ఒక నివేదిక ప్రకారం భారతదేశంలోని 1% సంపన్నులు దేశసంపదలో 58% కలిగి ఉంటే, దేశంలోని 67 కోట్ల పేదల వద్ద ఒక శాతం సంపద మాత్రమే ఉంది. 13.8% ఉన్న ధనిక రైతుల వద్ద సాగుభూమి 46% ఉంటే, 84%గా ఉన్న చిన్న, సన్నకారు రైతుల వద్ద 47.3% భూమి ఉంది.

# జవహర్‌నగర్‌లో 16 కాలనీల బోనాల పండుగ వేడుకలు వాయిదా : జూలై 27న ఉజ్జయిని మహంకాళి నల్ల పోచమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహణకు ఏర్పాట్లు

**జవహర్‌నగర్ తెలంగాణ షాన్ , జూలై 14:**
జవహర్‌నగర్‌లో ప్రతి ఏటా ఘనంగా జరిగే బోనాల ఉత్సవాలు ఈ ఏడాది ఆలస్యంగా ప్రారంభం కానున్నాయి. నూతనంగా ఏర్పడిన ఉజ్జయిని మహంకాళి - నల్ల పోచమ్మ ఉత్సవ కమిటీ తీసుకున్న నిర్ణయం మేరకు, జూలై 27వ తేదీకి వాయిదా పడ్డాయి. పండుగను మరింత అద్భుతంగా, ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్వహించాలనే ఉద్దేశంతో ఈ మార్పు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

### బోనాల తేదీ మార్పునకు కారణాలు

బోనాల తేదీని మార్చడానికి కమిటీ సభ్యులు పలు కీలక కారణాలను వెల్లడించారు. ముఖ్యంగా, పూజారులు, పోతరాజులు, వాయిద్యకారులు వంటి కులవృత్తుల వారికి సరైన సమయానికి లభించకపోవడం. ఈ నిర్ణయానికి ప్రధాన కారణం. గతంలో ఏర్పాట్లలో తలెత్తిన కొన్ని ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, ఈసారి అటువంటి సమస్యలు పునరావృతం కాకుండా ముందు జాగ్రత్తగా తేదీని మార్చినట్లు తెలిపారు. కులవృత్తుల వారికి తగినంత సమయం లభించడం ద్వారా పండుగకు సంబంధించిన అన్ని కార్యక్రమాలు సజావుగా జరుగుతాయని కమిటీ ఆశాభావం వ్యక్తం చేసింది.

### కమిటీ నిర్ణయం

ఈ ముఖ్యమైన నిర్ణయాన్ని ఉజ్జయిని మహంకాళి - నల్ల పోచమ్మ ఉత్సవ కమిటీ పెద్దలు మరియు సభ్యులు ఏకగ్రీవంగా తీసుకున్నారు. కమిటీ పెద్దలు కుత్తడి రవీందర్, పొన్నగంటి బాబు, కేకే చారి, బూడిద వెంకటేష్, వడ్డెర వెంకటేష్, మరియు 16 కాలనీల అధ్యక్షులు ఈ నిర్ణయానికి మద్దతు పలికారు. కుత్తడి రవీందర్ మాట్లాడుతూ, "ప్రజలందరి సహకారంతో ఈసారి బోనాలను మరింత అద్భుతంగా, వైభవంగా జరుపుకుంటాం'' అని ఈ సందర్భంగా తెలియజేశారు.



**ఉజ్జయిని మహాకాళి – నల్ల పోచమ్మ ఉత్సవ కమిటీ సభ్యులు:**
కుత్తడి రవీందర్, పొన్నగంటి బాబు, కే కే. చారి, సికందర్, శేఖర్, మల్లారెడ్డి, కుమార్, ఆర్.సి. శ్రీకాంత్, జి. వెంకన్న, భాస్కర్ గౌడ్, ఈ. రాజు, సూర్ణ ఆంజనేయులు, రాగుల యాదగిరి, ఈ. వెంకటేష్, ఎల్లమ్మ, బి. మల్లేష్, కె. భాస్కర్, కె. రవీందర్ చారి, కిరణ్ చారి, నరేష్ చారి, నరేందర్, విజయలక్ష్మి, దివాకర్, సత్యనారాయణ, ఆంజనేయులు, బూడిద వెంకటేష్, ఎం. రవి, బద్రి, చికెన్ జనార్దన్ రెడ్డి, నక్క శ్రీనివాస్, నల్ల శ్రీపతి, రమేష్, ఉప్పలయ్య.

**బోనాలలో పాలుపంచుకుంటున్న కాలనీలు:**
భక్తాబాయి కాలనీ, ముత్తుస్వామి కాలనీ, కేపీఎన్ కాలనీ, లక్ష్మీ నరసింహ కాలనీ, రేణుకా నగర్, బీరప్ప గడ్డ, ఆదర్శ్ నగర్ కాలనీ దశ 2, ఆదర్శ్ నగర్ కాలనీ దశ 1, సుస్మితా నగర్ కాలనీ, అయ్యప్పన్ కాలనీ, వికలాంగుల కాలనీ, మదర్ థెరిస్సా కాలనీ, శివ నగర్, జయశంకర్ కాలనీ, నెహ్రూ నగర్, కొత్త వెంకటేశ్వర కాలనీ. ఈ మార్పుల ద్వారా బోనాల ఉత్సవాలు మరింత సజావుగా, ఎలాంటి ఆటంకాలు లేకుండా జరుగుతాయని కమిటీ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు. జవహర్ నగర్ ప్రజలందరూ ఈ వేడుకలలో పాల్గొని, మహంకాళి అమ్మవారి ఆశీస్సులు పొందాలని వారు కోరారు.

# దుబ్బాక కాళిదాస్ గౌడ్, కనకలక్ష్మి దంపతులచే కాప్రా రేణుక ఎల్లమ్మ ఆలయానికి వెండి శఠగోపం విరాళం





**- ఆలయానికి వెండి శఠగోపం విరాళం**

**కాప్రా తెలంగాణ షాన్, జులై 14:**
కాప్రా పోచమ్మ సహిత రేణుక ఎల్లమ్మ ఆలయం వెండి శఠగోపం విరాళంతో మెరిసిపోయింది. దుబ్బాక కాళిదాస్ గౌడ్, కనకలక్ష్మి దంపతులు ఆదివారం రోజు ఆలయానికి ఒక వెండి శఠగోపాన్ని బహూకరించారు. ఈ విరాళ కార్యక్రమానికి ఆలయ కమిటీ అధ్యక్షుడు మండల రవీందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎం. ఉమా మహేశ్వర్ గౌడ్, కోప్పుల కుమార్, మండల నాగరాజు గౌడ్, మరియు ఆలయ పూజారి మోహన్ హాజరయ్యారు. కాప్రా డివిజన్ ప్రజలు ఈ దాతృత్వాన్ని అభినందించారు. కాళిదాస్ గౌడ్, కనకలక్ష్మి దంపతులు ఆలయ అభివృద్ధికి మరియు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తాము కట్టుబడి ఉన్నామని ఈ సందర్భంగా తెలియజేశారు. వారి విరాళం ఆలయానికి మరింత శోభను చేకూర్చిందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

# భూ కబ్జా చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

## - (హెచ్ఎండిఏ కమిషనర్ కార్యాలయంలో నిరసనకు దిగిన అసోసియేషన్ ప్రతినిధులు)



**అమీర్పేట్, జులై 14:**
మేడిపల్లి హెచ్ఎండిఏ లేఔట్ లో పార్కు స్థలాలు కబ్జా చేసిన వారిపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ హెచ్ఎండిఏ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం హెచ్ఎండిఏ కార్యాలయంలో ఆందోళన చేశారు. సామాజిక అవసరాలు పార్కులు ఇతరత్రా సంబంధించిన కోట్లాది రూపాయలు విలువ చేసే భూముల కబ్జా చేసినవారిపై చర్యలు తీసుకోవాలని నిదానాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ హెచ్ఎండిఏ డిప్యూటీ ఎస్టేట్ అధికారి కార్యాలయంలో నేలపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేడిపల్లి హెచ్ఎండిఏ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎంపల్లి పద్మారెడ్డి ఈదునూరి హేమంత్ కుమార్, సంతోష్ రెడ్డి లు మాట్లాడుతూ మేడిపల్లి హెచ్ఎండి లేఔట్ లోని సామాజిక అవసరాలు పార్కులు ఇతరత్రా అభివృద్ధి పనుల కోసం కేటాయించిన స్థలాలకు ఫెన్సింగ్ వేసి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై స్పందించిన డిప్యూటీ ఎస్టేట్ అధికారి సుదర్శన్ మాట్లాడుతూ మేడిపల్లి లోని హెచ్ఎండిఏ స్థలాలను కబ్జా చేస్తే సహించేది లేదని వారిపై క్రిమినల్ కేసులు నమోదుచేసి చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రోహిత్, ప్రసాద్, రైతులు మేడిపల్లి మాజీ సర్పంచ్ కుతాడి నరసింహ, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# రవి నారాయణరెడ్డి నగర్ ఫేస్-2 లో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్









**కుత్బుల్లాపూర్ జూలై 14 తెలంగాణ షాన్ ప్రతినిధి జెమిని నాగరాజు గౌడ్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని 125 గాజులరామారం డివిజన్ లోని రవి నారాయణరెడ్డి నగర్ ఫేస్-2 కాలనీ వాసుల విన్నపం మేరకు అస్తవ్యస్తంగా ఉన్న రోడ్ నెంబర్ 6,7,8,9 గల్లీలలో నూతన సీసీ రోడ్ల ఏర్పాటు కొరకు లిమాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ సంబంధిత అధికారులతో మాట్లాడి 84 లక్షలతో సీసీ రోడ్లు మంజూరు చేపించడం జరిగింది. అనంతరం కూన శ్రీశైలం గౌడ్ రవి నారాయణరెడ్డి నగర్ ఫేస్-2 లోని సీసీ రోడ్లు మంజూరైన రోడ్ నెంబర్ 6,7,8,9 లను బస్తీవాసులతో కలిసి పర్యవేక్షించడం జరిగింది. కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ మాజీ ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ.. ప్రజా పాలనలో ప్రజల సంక్షేమమే ముఖ్య ప్రాధాన్యత అన్నారు..

గత 10 సంవత్సరాలు అభివృద్ధికి నోచుకోలేని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఈనాడు మన ఇంచార్జ్ మంత్రివర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు నాయకత్వంలో కుత్బుల్లాపూర్ అభివృద్ధి చెందుతుందన్నారు.. ఇది ప్రజా ప్రభుత్వం, ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చినా ప్రజా నాయకుడి వద్దకు వచ్చే మీ సమస్యకు పరిష్కార మార్గాన్ని ఎంచుకోవాలని కోరారు.. ఈ కార్యక్రమంలో సాయి ప్రసాద్, మురళి, లక్ష్మయ్య, ధర్మారావు, రమేష్, శ్రీనివాస్ రావు, మల్లేశ్, లోకనాథం, సురేష్, మహేష్, జగన్నాథం, లక్ష్మణ్ రావు, రఘుపతి, రాము, సతీష్, మన్మధరావు, అప్పన్న గార్లతో పాటు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# జోనల్ కమిషన్ నీ కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే



**కాప్రా జులై 14:**
ఎన్నో యేండ్ల నుండి చర్లపల్లి డివిజన్ సంబంధించిన కాలనీల కి చెందిన రెడ్డి కాలనీ, భగవాన్ కాలనీ, కృష్ణ నగర్, ఎం ఆర్ ఆర్ కాలనీ నుండి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ లేక వర్షకాలం నుండి నీరు బయటికి పోలేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. NOC రావడంతో ZC ని కలవడం జరిగింది. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు మహేష్ గౌడ్ ,రెడ్డి కాలనీ ప్రెసిడెంట్ భూమి రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకట్ రామ్ రెడ్డి, జీవన్ రెడ్డి, సురేందర్ రెడ్డి, వెలుమ రెడ్డి అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యం : పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్

- ప్రపంచంలోనే అతి ఎత్తైన గాంధీజీ విగ్రహం నెలకొల్పడం సీఎం రేవంత్ రెడ్డి ఆశయం.. మంత్రి సీతక్క
- గాంధీజీ త్యాగాలను యావత్ ప్రపంచానికి తెలపడమే గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ,గాంధీ జ్ఞాన్ ప్రతిష్ట లక్ష్యం... చైర్మన్ గున్న రాజేందర్ రెడ్డి..
- రాష్ట్ర యూత్ అధ్యక్షులు కాలసాని సంజయ్ రెడ్డి.. ఆధ్వర్యంలో గాంధీజి విజ్ఞాన సదస్సు...,
- 1500 గాంధీ విగ్రహాల ప్రదర్శన 100 చరక నూలు ప్రదర్శన..
- గాంధీభవన్లో అంగరంగ వైభవంగా 50 సంవత్సరాల వేడుకలు










**హైదరాబాద్, తెలంగాణ షాన్, జులై 14:** మహాత్మా గాంధీజీ సిద్ధాంతాలు ఆలోచనలు ఆయన చూపిన బాట ప్రపంచ దేశాలకు మార్గదర్శకమని తెలంగాణ రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ పేర్కొన్నారు, గాంధీజీ చరిత్రను ఎవరు చెరిపేస్తే చెరగని చరిత్ర అని, నేటి యువత, గాంధీజీ. మార్గాన్ని అనుసరించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి,సీతక్క, ఎంపీ బలరాం నాయక్, ప్రభుత్వ చీఫ్ విప్ రాంచందర్ నాయక్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డిలు పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్ గాంధీభవన్ ప్రకాశం హాలులో జరిగిన గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ గాంధీ జ్ఞాన్ ప్రతిస్టాన్ 50 సంవత్సరాల స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా రాష్ట్ర చైర్మన్ గున్న రాజేందర్ రెడ్డి సారథ్యంలో, తెలంగాణ యూత్ అధ్యక్షులు కా లసానిసంజయ్ రెడ్డి రాష్ట్ర యువజన మహిళా అధ్యక్షురాలు బొమ్మ ప్రవల్లిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సు కు మహాత్ముని చెరక అవార్డుల ప్రధానోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మంత్రి సీతక్క,, ఎంపీ బలరాం నాయక్, ప్రభుత్వ చీఫ్ విప్ అద్దంకి దయాకర్, చీప్ వీ ఫ్ రామచంద్రనాయక్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి లు, హాజరయ్యారు వీరితోపాటు అఖిలభారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షులు కందగట్ల స్వామి ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు గుంటక రూప తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు ఈ సందర్భంగా గున్న రాజేందర్ రెడ్డి, ఆధ్వర్యంలో మంత్రులు ప్రముఖులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు, సదస్సులో విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్ లను సైన్స్ ఫెయిర్ ను, గాంధీజి గ్యాలరీని.నేతన్నల చేరకాలను, సందర్శించారు, గాంధీ ఫ్యామిలీ అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన 2500 గాంధీజీ విగ్రహ స్టాల్ ను సందర్శించారు ఈ సందర్భంగా పిసిసి అధ్యక్షు డు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్నా గ్రామ స్వరాజ్యం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం, అని పేర్కొన్నారు గాంధీజీ చరిత్రను తిరగరాసే ప్రయత్నం చేస్తున్నారని ఇది భారతదేశ సమాజానికి మంచిది కాదని ఎప్పటికైనా గాంధీజీ మార్గమే శరణ్యం అన్నారు గాంధీజీ బాటను నేటి యువత ఎంచుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రైవేట్ స్కూళ్ల ఆధ్వర్యంలో చిన్నారులు చేసిన కూచిపూడి,నృత్యాలు ఎందరో ఆకట్టుకున్నాయి, చిన్నారులు చేసిన మల్కా ప్రదర్శన ఆహుతులను ఎంతో అలరించింది ,

### ఆకట్టుకున్న స్టాల్స్ ప్రదర్శన

విజ్ఞాన సదస్సుకు వెళ్లె క్రమంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాలు, సేంద్రీయ వ్యవసాయ పద్దతిలో పండించిన ఆహారపు ధాన్యం, కూరగాయలు, ఎలక్ట్రికల్ వాహనాలు, బ్లూబెర్రీ, టేకు, డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు, చిరు ధాన్యాలతో తయారు చేసిన తిను బండరాలు, స్వీట్లు అందరిని ఆకర్షించాయి. వీటితో పాటు ఇంట్లో పండించుకునే సేంద్రీయ కూరగాయాల విత్తనాలు, ప్రకృతి వ్యవసాయంలో పండించిన పసుపు, పెసర్లు, పల్లిలు, అల్లం వంటివి విజ్ఞాన కేంద్రాన్ని వీక్షించేందుకు వచ్చిన ప్రజలు కొనుగోలు చేశారు. ఎద్దు గానుగ నూనె తయారీ విధానాన్ని అందరు ఆశ్చర్యంగా చూశారు.

అంశాలపై విద్యార్థులు నిర్వహించిన సైన్స్ స్పేర్, వివిధ దేశాల కరెన్సీ, గాంధీ విగ్రహాలు, చరక ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. దాదాపు 1,50 మంది విద్యార్థులు చరకతో చేనేత నులు వాలకడం, కార్యక్రమం, సభా ప్రాంగణానికి వన్నె తెచ్చింది, తెలంగాణ రాష్ట్రం తో పాటు జాతీయ స్థాయిలో సేంద్రీయ ఎరువులతో వ్యవసాయం చేస్తున్న ఉత్తమ రైతుల సేవలను గుర్తించి, వందలాదిమంది రైతులకు, ఘన సన్మానం చేసి, తో,సత్కరించారు గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ గాంధీ జ్ఞాన ప్రతిష్ట ఏర్పాటుచేసిన కార్యక్రమం పట్ల యావత్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి రైతులతో పాటు 2500 మందికి పైగా సందర్శకులు పాల్గొని కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున విజయవంతం చేశారు.. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో వ్యవసాయ, రైతు సంక్షేమ గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ గున్నా రాజేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యానాల,ప్రభాకర్‌రెడ్డి, కన్వీనర్ పావని రెడ్డి,ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంరుగు మధు, రాష్ట్ర యువజన అధ్యక్షులు కాలసాని , సంజయ్ రెడ్డి, రాష్ట్ర యువజన మహిళా అధ్యక్షురాలు బొమ్మ ప్రవల్లిక,గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ కన్వీనర్ గాంధారి ప్రభాకర్ వర్కింగ్ ప్రెసిడెంట్ బోడిపూడి రాజు రాష్ట్ర కార్యదర్శి ఎర్రమల రామచందర్ రెడ్డి ప్రచార కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మజీద్ ఖాన్ రాష్ట్ర అధికార ప్రతినిధి ముద్దం రవితేజ రెడ్డి యువనేత సాయిచంద్ సంతోష్ రెడ్డి శ్రీకాంత్ రాజకుమార్ నరేష్ అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారునికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును అందజేసిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి



**కుత్బుల్లాపూర్ జులై 14 తెలంగాణ షాన్ ప్రతినిధి జెమిని నాగరాజు గౌడ్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 131 డివిజన్ బాపు నగర్ వాసులు పరిపటి అజిత గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రి లో చికిత్స పొందుతూ చికిత్సకు సరిపడా స్థోమత లేక కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ని సంప్రదించగా వెంటనే స్పందించి గౌరవ రాష్ట్ర మంత్రివర్యులు శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా శస్త్ర చికిత్స నిమిత్తం రూ. 60,000/- ల ముఖ్యమంత్రి సహాయనిధి ని మంజూరు చేయించి ఈరోజు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బాపు నగర్ వాసులు పరిపటి అజిత కి - రూ 60,000/- ల CMRF-మంజూరి పత్రాన్ని (చెక్కు) అందజేశారు. అనంతరం హన్మంతన్న మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల ద్వారా ఎంతో మేలు చేకూరుతుందని అలాగే అనారోగ్యం బారిన పడిన ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని,పేద ప్రజల సంక్షేమ ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో NMC అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో బీఆర్ఎస్ కు మరో భారీ షాక్

- కాంగ్రెస్ పార్టీలో భారీ ఎత్తున చేరికలు



**ఉప్పల్ కాప్రా జూలై 14:** ఉప్పల్ నియోజకవర్గం లోనూ బీర్ఎస్ పార్టీ వీడుతున్న నేతలు, కార్యకర్తలు ఉప్పల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ కు మరో భారీ షాక్ తగిలింది. ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి పరమేశ్వర్ రెడ్డి, పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతోనే కాంగ్రెస్ లోకి చేరికలు: పరమేశ్వర్ రెడ్డి రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యంలో ప్రజాపాలన నడుస్తుందని ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ, బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం వంటి అంశాలతోనే కాంగ్రెస్ లోకి భారీగా చేరికలు జరుగుతున్నాయన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో అన్ని పార్టీల దృష్టి కాంగ్రెస్ వైపు మళ్లిందన్నారు. కాంగ్రెస్ పార్టీ లో చేరినవారిల గట్టు ఇందిరా మాజీ వార్డ్ మెంబర్తో పాటు పలువురు ఉన్నారు. కార్యక్రమంలో ఉప్పల్ A బ్లాక్ ఎస్ సి సెల్ అధ్యక్షులు లింగంపల్లి రామకృష్ణ, రఫీక్, లూకాస్, వలపు శ్రీకాంత్ యాదవ్, అనిత సత్తి రెడ్డి, బాబు రావు,బుల్లెట్ అశోక్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాలానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం



**జవహర్ నగర్, తెలంగాణ షాన్, జులై 14:** జులై 15.బాలానగర్‌లోని 33/11 కేవీ బాలాజీ నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ లక్ష్మీ నర్సింహ ఫీడర్‌పై మంగళవారం నిర్వహణ పనుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఏఈ/ ఆపరేషన్స్/బాలాజీ నగర్ హెచ్. శంభాశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిర్వహణ పనుల్లో భాగంగా 11 కేవీ లక్ష్మీ నర్సింహ ఫీడర్‌తో పాటు డిటిఆర్ ఏబీ స్విచ్‌లు, లైన్ ఏబీ స్విచ్‌ల మరమ్మతులు చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. విద్యుత్ సరఫరా నిలిపివేత వివరాలు, తేదీ 15 జులై , మంగళవారం సమయం. ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు (మొత్తం 3 గంటలు) ప్రభావిత ప్రాంతాలు, ఈ పనుల కారణంగా సిటిజన్ కాలనీ, బీరప్పగడ్డ, లక్ష్మీ నర్సింహ కాలనీ, వికలాంగుల కాలనీ, ఆదర్శ్ నగర్, రేణుకా నగర్, కేపిఐ కాలనీ, సుస్మితా నగర్, చెన్నపురం, చిలుకల బిల్డింగ్, డబుల్ బెడ్‌రూమ్ బిల్డింగ్స్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అధికారులు తెలిపారు. పనులకు సహకరించాలని విద్యుత్ శాఖ ప్రజలను కోరింది. అసౌకర్యానికి చింతిస్తున్నామని అధికారులు పేర్కొన్నారు.

## సోషలిజం, సెక్యులరిజం పదాల అర్ధమేంటో తెలుసా?

"సోషలిస్టు, సెక్యులర్ అనే పదాలు దేనికి ప్రతీక వాటివల్ల ఎవరికైనా అర్హతకు మించిన లబ్ధి జరుగుతుందా? రాజ్యాంగ పీఠికలో సోషలిస్టు, సెక్యులర్ అనే పదాలు ఉండాల్సిన అవసరం లేదు" ఇటీవల కాలంలో మనువాద అనుయాయుల నుంచి ఇలాంటి చర్చ ఎక్కువైంది. ఇంత రాద్ధాంతం జరుగుతుంటే దాన్ని బలపరుస్తున్న వారంతా సోషలిస్టు, సెక్యులర్ అనే పదాల అర్థాలు తెలిసిన వారేనా? సెక్యులర్ అంటే "ముస్లిం మతానికి ప్రాధాన్యత నివ్వడం" లేదా "ఇతర మతాలను హిందూ మతంతో సమానంగా భావించడం", సోషలిజం అంటే "ఉన్న వాళ్లది లాక్కెళ్లి పేదవాళ్లకు పంచిపెట్టడం" వంటి అవగాహనా రాహిత్యంలోని అక్కసు మాత్రమే. ఇలా తమ కాళ్లను తామే నరుక్కునే స్థితిలోకి పడిపోతుండటం చాలా బాధాకరం. సామ్యవాదం, సెక్యులరిజం అనే పదాలు బాధ్యతను నెరవేర్చడానికి తీసుకున్న ప్రమాణాలు మాత్రమే. పరిపాలనలో ఇలాంటి రాతపూర్వక ప్రతిజ్ఞ కూడా లేకుంటే పాలకవర్గాలు ఇష్టారీతినా చెలరేగిపోవా? ఒక్కమాటలో చెప్పాలంటే ఆధిపత్యం లేనివాదమే సామ్యవాదం. పక్షపాతం లేని ప్రయాణమే సెక్యులరిజం. సెక్యులరిజం అంటే? "పరిపాలనలో మతం జోక్యం చేసుకోరాదు, మత వ్యవహారాల్లో పాలకులు జోక్యం చేసుకోరాదు" అని కదా నిజమైన అర్థం. అధికారిక జీవితంలో వ్యక్తిగత ప్రాథమ్యాలు ఉండకూడదు, వ్యక్తిగత ఆచార వ్యవహారాలపై రాజ్యము లేదా పాలనా సంబంధిత నిబంధనలు ఉండరాదు. ప్రజాస్వామ్య దేశంలో ఇది సహజం అమలవుతుంది. దేశంలోని వివిధ మతాల ప్రజలు, ఆయా మతాలు విభిన్నమైన సంస్కృతులను పాటిస్తారు. ఇస్లాం క్రైస్తవ బౌద్ధ, హిందూ మతాల్లోని అనేక సంప్రదాయాలు ప్రాంతాలను బట్టి అందులోని రకరకాల జాతుల, కులాల, ఉపకులాలను బట్టి మారుతూ ఉంటాయి. ఒకే దేవుడికి శాఖాహారము, మాంసాహారము విడివిడిగా కలిసి నైవేద్యాలు సమర్పించబడతాయి. ఆచార వ్యవహారాలను నిర్బంధంగా అమలు జరిపించడం అసాధ్యం. పూర్తి క్రూరమైన మత రాజకీయాల్లో ప్రజల వ్యక్తిగత ఆచార వ్యవహారాలపై కూడా నిర్బంధాలు ఉంటాయి. అంటే ఏ దేవుడిని పూజించాలి, ఏ ఆచార సంప్రదాయాలు పాటించాలో పాలకులు శాసిస్తారు. అలాగే మత పెద్దలు కూడా పరిపాలన ఎలా ఉండాలో? ప్రజలను ఏ విధంగా నియంత్రించాలో? పాలకులకు నిర్దేశిస్తారు. యూరప్‌లో క్రైస్తవ మిషనరీలు పాలకులను ఆ విధంగా శాసించాయి. కనుకనే అలాంటి పాలనలన్నీ కూలిపోయాయని చరిత్ర చెప్పిన సత్యం. సోషలిజం అంటే? సంక్షేమ రాజ్యమని అర్థం. భారత రాజ్యాంగం ఆర్టికల్ 39 నుండి 51 వరకు సంక్షేమ రాజ్యంపై ఆదేశిక సూత్రాల ద్వారా స్పష్టంగా పేర్కొన్నది. ఆర్టికల్ 41 మరింత స్పష్టంగా ప్రజల సంక్షేమంపై ప్రభుత్వానికి ఉండాల్సిన బాధ్యత లేమిటో విశద పరిచింది. రాజ్యమంటే కుటుంబ యజమాని. కుటుంబ యజమాని ఎలాగైతే ఆహారం, ఆరోగ్యం, చదువు, ఉపాధి, వృద్ధాప్య భాధ్యతపై దృష్టిపెట్టి సహకరించి భవిష్యత్తుకు బాట చూపిస్తాడో రాజ్యం కూడా తన ప్రజలకు అదేవిధమైన సహకారాన్ని అందించాలని ప్రమాణం చేసిన క్రమమే సామ్యవాదం. ఈ పదం రాజ్యాంగంలో ఉంది గనుక ఉచిత పథకాల ద్వారా ప్రజలకు దోచిపెడుతున్నారు అనే దుర్భావనలో కొందరు న్నారు. సంక్షేమ రాజ్యమంటే ఉచిత పథకాల ద్వారా చేయి విదల్చడం కాదు. ప్రజల నుండి వివిధ రూపాల్లో వచ్చిన పన్నుల ద్వారా కావాల్సిన మౌలిక వసతులు, కర్మాగారాలు, రవాణా సౌకర్యాలు, భారీ ప్రాజెక్టులు నిర్మించడంతో పాటు రోజువారి గడవటానికి కూడా కావాల్సిన ఏర్పాట్లు చేయడం. 1970వ దశకంలోనే మతప్రాతిపదిక రాజకీయాలకు కుంపటి అంటుకుంది. జవహర్‌లాల్ నెహ్రూ వ్యవహరించిన తటస్థ (న్యూట్రల్) పద్ధతికి ఇందిరాగాంధీ ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చిందన్న వాదనకు ప్రతిపక్ష పదును పెట్టింది. మరోవైపు కుల అంతరాలతో అంటరానితనం సమసిపోలేదని నాటి ప్రభుత్వం గమనించింది. కులమత అంతరాలు అధికారిక కార్యక్రమాల్లో ఉండరాదని ఇందిరాగాంధీ భావించారు. దేశ పరిపాలనలో వ్యక్తిగత సాంప్రదాయ ఆచార వ్యవహారాలకు తావుండకూడదని సెక్యులర్ అనే పదాన్ని రాజ్యాంగ పీఠికలో పొందుపరిచారు. ఇప్పుడు సెక్యులరిజం అనే పదాన్ని తీసేస్తే దేశం ఒక మత రాజ్యంగా అవతరిస్తుంది. మత రాజ్యంగా అవతరించిన తర్వాత ఏ కార్యక్రమాలు, ఎలాంటి పూజలు, పునస్కారాలు చేయాలో గద్దెనెక్కిన వారే నిర్ణయిస్తారు. అంటే పార్లమెంట్ ప్రారంభోత్సవానికి సెంగోల్ పట్టుకుని ఒకరెళితే మరొక జాతికి సంబంధించిన వ్యక్తి ప్రధాని అయినప్పుడు జంతుబలి లేదా మరే ఇతర పద్ధతిలోనో ప్రారంభోత్సవం చేస్తారు. ఈ వ్యవహారాలను గమనించి మఠాధిపతులు, పీఠాధిపతులు దేవస్థానాల బోర్డులు, కులసంఘాలు, మత సమూహాలు తమలో తాము విభేదించి తీవ్ర ప్రతిపాదనలు ముందుకు తీసుకురావడానికి అవకాశం లభిస్తుంది. సెక్యులరిజం వ్యక్తిగత ఆచారాలకు నిర్బంధాన్ని విధించకుండా అధికారిక ప్రయాణాల్లో పాటించాల్సిన నిష్పక్షపాత పద్ధతులను సూచించే దిక్సూచి లాంటిది. ఇటీవల చూస్తే ఉరుము ఉరిమి మంగళం మీద పడ్డట్టు యాభై ఏండ్ల కింద భారతదేశంలో విధించిన అత్యవసర పరిస్థితిపై చర్చ జరుపుతూ భారత రాజ్యాంగ పీఠికలో సోషలిస్టు, సెక్యులర్ అనే పదాలపై విరుచుకు పడుతున్నారు.సామ్యవాదం, సెక్యులరిజం అనే పదాలు హిందూ మతానికి వ్యతిరేకమైనవిగా చిత్రీకరిస్తున్నారు. అంబేద్కర్ పొందుపర్చిన రాజ్యాంగ పీఠిక కావాలా? ఇందిరా గాంధీ మార్చి రాసిన రాజ్యాంగ పీఠిక కావాలా? అంటూ అర్నాబ్ గోస్వామిలాంటి వాళ్లు విషయాన్నీ విడమర్చకుండానే విద్వేషాన్ని విరజిమ్ముతున్నారు. ద్వేష పార్టీల సోషల్ మీడియా సైనికులు తమ వాట్సాప్ వాహనాలపై దీన్ని ఊరేగిస్తున్నారు. ఇది చాలా నష్టదాయకమైన పోకడ.ఆ నాటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీ కాలంలో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా భారత రాజ్యాంగం పీఠికలో సెక్యులర్, సోషలిస్ట్ అనే పదాలను జోడించించారు.అయితే ఇదేదో ప్రజలమీద ప్రేమతో కాదు. 1970వ దశకం ప్రారంభం నుండి ఆర్థిక సంక్షోభం మొదలైంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి అప్పటికి 25 ఏండ్లు గడిచిపోయినా ప్రజల ఆర్థిక స్థితుల్లో మార్పులు లేకపోగా స్వాతంత్ర్య ఫలాలను భూస్వాములతో కలిసి పెట్టుబడిదారులు మాత్రమే ఆరగించడం పెరిగిపోయింది. నిరుద్యోగం విపరీతమైంది. గ్రామాల్లో దేశ్‌ముఖ్‌ల వంటి పెత్తందారీ వ్యవస్థ తగ్గిపోయినప్పటికీ దొరల పాలనలో అసమానతల పర్వం తారాస్థాయికి చేరింది. ఆ సందర్భంలో 'గరీబీ హఠావో' అనే నినాదాన్ని కూడా ఇందిరాగాంధీ తీసుకున్నారు. అయితే ఈ పరిస్థితులను అప్పటి ప్రతిపక్ష రాజకీయ సమూహాలు సరిగ్గా ఎత్తి చూపటం ప్రారంభించాయి. అభ్యుదయ రీతిలో దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన అంశాన్ని అప్పటి తరానికి గుర్తుండటం వల్ల, ప్రధానిని వ్యతిరేకించడానికి కోర్టులు కూడా వెనుకాడలేదు. ఈ నేపథ్యంలో ఇందిరాగాంధీ ఎన్నికను సవాలు చేయడం, అలహాబాద్ హైకోర్టు తీర్పునివ్వడం వీటి పర్యవసానాలుగా ఇందిరాగాంధీ భావించారు. అందుకే తమ ప్రభుత్వం "ప్రజా సంక్షేమాన్ని వీడింది" అనే దుష్ప్రచారం జరుగుతోందని, తమది సంక్షేమ ప్రభుత్వమని సరాసరి రాజ్యాంగ పీఠికలో సామ్యవాదం అని పదాన్ని జోడించి రుజువు చేసుకున్నారు.

# కలగా మారుతున్న గిరిజన వర్సిటీ...

**అదిలాబాద్ :** అడవుల జిల్లా ఆదిలాబాద్ అంటేనే... ఆదివాసీలు. అలాంటి ఆదిలాబాద్‌కు గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేస్తూ గతంలో పాలకులు ప్రకటన సైతం చేశారు. కానీ యూనివర్సిటీ ఏర్పాటు కల నేటికి నెరవేరకపోవడంతో, జిల్లాలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు కల కలగానే మిగిలిపోనుందా అని జిల్లా ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఉన్నత విద్యా సంస్థల స్థాపనకు అనువైన ప్రాంతాల అధ్యయనానికి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నియమించిన ప్రొఫెసర్ల కమిటీ ఆదిలాబాద్ ప్రాంతంలో ఉన్నత విద్య సంస్థల ఏర్పాటుకు అనువైన అవకాశాలు పూర్తి స్థాయిలో ఉన్నాయని దింతో జిల్లాకు గిరిజన యూనివర్సిటీని ప్రకటించిన సంగతి తెలిసిందే. దశాబ్దాలుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విశ్వవిద్యాలయం ఏర్పాటు కాకపోవడం పాలకుల చిత్తశుద్ధికి అద్దంపడుతుంది. తెలంగాణ రాష్ట్రంలోని పాత 10 జిల్లాల్లో యూని వర్సిటీ లేని ఏకైక జిల్లాగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నిలిచింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సహజసిద్ధ ప్రకృతి వనరులకు, అడవులకు, భిన్న సంస్కృతి సంప్రదాయాలకు ప్రసిద్ధి. సింగరేణి బొగ్గు గనులు, సున్నపురాయి, కాగితపు పరిశ్రమ, మాంగనీస్ గను లు విస్తరించాయి. పెన్ గంగా, గోదావరి, ప్రాణహిత, పెద్దవాగు నదులున్నాయి. మూడు కాలాల్లో నమోదయ్యే భిన్నమైన వాతావరణ స్థితిగతులు పరిశోధనలకు నెలవు. దేశంలోనే అత్యంత ప్రాముఖ్యత కల్గిన చదువుల తల్లి సరస్వతి దేవి కొలువైన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విశ్వవిద్యాలయం లేకపోవడంతో ఈ ప్రాంత వాసులు ఉన్నత చదువుల కోసం అష్టకష్టాల నడుమ ఉమ్మడి జిల్లాను దాటి వేరే జిల్లాలకు వెళ్తున్నారు. మరికొంత మంది ఆర్థికభారం, దూరభారం వల్ల మధ్యలోనే చదువులకు స్వస్తి పలుకుతున్నారు. ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాలలో అంబేద్కర్ విశ్వవిద్యాల యం అధ్యయన కేంద్రాలు, దూర విద్యాకేంద్రాల ద్వారా పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయే తప్పితే పూర్తి స్థాయి పీజీ కోర్సుల కళాశాలలు లేకపోవడం ఉన్నత చదువుకు ప్రతికూలంగా మారింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత వాసులకు ఉన్నత చదువులకే కాకుండా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. అత్యంత వెనుకబడిన జిల్లాగా పేరున్న ఉమ్మడి జిల్లాల్లో అటవీ విస్తీర్ణం ఎక్కువగా ఉండడం, సుమారు మూడు లక్షల యాభై వేలకు పైగా గిరిజనులు ఉన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా భౌగోళికంగా మహారాష్ట్ర, ఛత్తీషగఢ్‌లతో సరిహద్దును పంచుకోవడం, జిల్లా గుండా జాతీయ రహదారి 44 తో పాటు ఇతర రహదారులు వెళ్లడం, దక్షిణ మధ్య రైల్వే లైన్ జిల్లా నుండి వెళ్లడం, యూనివర్సిటీ ఏర్పాటుకు కావాల్సిన భూములు ఉన్నప్పటికీ గిరిజన విశ్వవిద్యాలయం జిల్లాలో ఏర్పాటు చేయించడంలో ఈ ప్రాంత ప్రజా ప్రతినిధులు వైఫల్యం చెందారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 2008 లో కేంద్రంలో అధికారంలో ఉన్న యూపీఏ ప్రభుత్వం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. అదే సంవత్సరం నవంబర్ 17న జీవో 797 ను విడుదల చేసింది. అప్పట్లో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు 2011 ఆగస్టు 27న జీవో 783 ని జారీ చేసింది. దీంతో జిల్లా, ఐటీడీఏ అధికార యంత్రాంగం ఉట్నూర్ లో యూనివర్సిటీ ఏర్పాటుకు కావాల్సిన భూమిని గుర్తించింది. ఆదిలాబాద్ జిల్లాలో ఏర్పాటు కావాల్సిన యూనివర్సిటీ రాజకీయ పలుకుబడిని ఉపయోగించి ములుగు జిల్లాకు తరలించుకుపోయారు. ఉట్నూర్ లో ఏర్పాటు కావాల్సిన గిరిజన విశ్వవిద్యాలయంను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజా ప్రతినిధుల, రాజకీయ నాయకుల నిర్లక్ష్యం కారణంగానే ములుగు జిల్లాకు తరలిపోయిందని జిల్లా ప్రజలు పేర్కొంటున్నారు. జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటుకై పాలకులపై స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు ఒత్తిడి చేయలేకపోవడంతోనే జిల్లా నుండి గిరిజన యూ నివర్సిటీ తరలిపోయిందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గిరిజన యూనివర్సిటీ ఏర్పా టు కోసం ఉద్యమాలు చేసామని ఈ ప్రాంత ఆదివాసీ, గిరిజన సంఘాల నేతలు, విద్యార్థి సంఘాల నేతలు, విద్యావేత్తలు, మేధావులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్యామ్ పిట్రోడా నేతృత్వంలోని నాలెడ్జ్ కమిషన్ సిఫార్సుల మేరకు ప్రతి జిల్లాలో విశ్వవిద్యాలయలు ఏర్పాటు చేయాలని గతంలో కేంద్రం నిర్ణయించింది. ఇందులో భాగంగానే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్ పట్టణాన్ని ఎంపిక చేశారు. దీనికి కారణం అప్పటికే కాకతీయ యూనివర్సిటీ కి అనుబంధంగా పీజీ కళాశాల భవనం ఉండటం, సుమారు 25 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉన్న ఈ భవనంలో వసతులు, సౌకర్యాలకు కోదవలేకపోవడం సమీపంలో మరింత ప్రభుత్వ స్థలం ఉండటం వలన యూనివర్సిటీ ని ఏర్పాటు చేయవచ్చని భావించి మొదటి విడతగా 55 కోట్లు నిధులను కేటాయించారు. అప్పటి ప్రభుత్వ సిఫార్సుతో శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి పేరుతో సరస్వతి విశ్వవిద్యాలయం అని పేరును సైతం ప్రకటించా రు. కానీ ఆ సమయంలో రాష్ట్ర విభజన జరగడంతో యూనివర్సిటీ ఏర్పాటు ప్రతిపాదన అర్ధాంతరంగా నిలిచిపోయింది. సుమారు రెండు దశాబ్దాల పాటు నిర్మల్ కేంద్రంగా నడిచిన కాకతీయ యూనివర్సిటీ అనుబంధ ప్రభుత్వ పీజీ కాలేజీ సైతం ప్రస్తుతం మూతపడింది. దీంతో ఉమ్మడి



ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న ఒకే ఒక పీజీ సెంటర్ కూడా మూతపడింది. హైదరాబాద్ జే.ఎన్.టీ.యూకు అనుబంధంగా ఆదిలాబాద్ జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు గత ప్రభుత్వం జీవో నంబర్ 67 ను విడుదల చేసింది. కళాశాల ఏర్పాటు అవుతుందన్న తరుణంలో స్థల సేకరణ జరగక అది మరుగున పడింది. అ తర్వాత శాసనసభ, పార్లమెంట్ ఎన్నికలు రావడంతో కళాశాల ఏర్పాటు ప్రతిపాదన మరుగునపడిపోయింది. నిర్మల్‌కు చెందిన విద్యావేత్త, సామాజిక కార్యకర్త నంగే శ్రీనివాస్ శ్రీ జ్ఞాన సరస్వతీ విశ్వవిద్యాలయ సాధన సమితిని ఏర్పాటు చేసి గత కొన్నేళ్లుగా సరస్వతీ విశ్వవిద్యాలయం పేరుతో యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయన ఇప్పటికే పలుమార్లు ఉన్నత అధికారులను, కేంద్ర, రాష్ట్ర ప్రజా ప్రతినిధులను కలిసి యూనివర్సిటీ ఏర్పాటు ఆవశ్యకతను వివరించారు. ఇటీవలే ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఓ ప్రముఖ పత్రిక ఆధ్వర్యంలో యూనివర్సిటీ ఏర్పాటు ఆవశ్యకత పై విద్యార్థులు, విద్యావేత్తలు, మేధావులు, విద్యార్థి సంఘాల నేతలు, రాజకీయ పార్టీల నేతలతో చర్చా వేదిక ను నిర్వహించింది. ఈ చర్చా వేదికలో పాల్గొన్న ప్రతి ఒక్కరు ముక్తకంఠంతో యూనివర్సిటీ ఏర్పాటు కావాల్సిందే అని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు గతంలో కేటాయించిన గిరిజన యూనివర్సిటీని ఎట్టి పరిస్థితిలో ఏర్పాటు చేయాలి, దీనికోసం గతంలో ఎన్నో ఉద్యమాలు చేపట్టాం. రానున్న రోజుల్లో సైతం ఉద్యమాలు చేపడతాం. ఇటీవల జరిగిన చర్చా వేదిక అనంతరం విద్యావేత్త, సామాజిక కార్యకర్త బద్దం పురుషోత్తం రెడ్డి సారథ్యంలో యూనివర్సిటీ సాధన జేఏసీ ని ఏర్పాటు చేసింది. వీరు త్వరలోనే తమ భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని పేర్కొన్నారు

## రాయచోటి రోడ్డు ప్రమాదంపై సీఎం చంద్రబాబు తీవ్రగ్భ్రాంతి -క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం

**అమరావతి జూలై :** అన్నమయ్య జిల్లాలో రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పుల్లంపేట మండలం రెడ్డిచెరువు కట్టపై మామిడి లోడుతో వెళ్తున్న లారీ బోల్తాపడి 9 మంది మృత్యువాత పడటంపై విచారం వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో 9 మంది చనిపోయారని, గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందిస్తున్నామని అధికారులు సీఎంకు తెలిపారు. రాజంపేట నుంచి రైల్వే కోడూరుకు వీరు ప్రయాణిస్తున్న సమయంలో రాత్రి ఈ ప్రమాదం చోటు చేసుకుందని అధికారులు సీఎంకు వివరించారు. మృతులంతా రైల్వేకోడూరు సెట్టిగుంట ఎస్టీ కాలనీకి చెందిన కూలీలని తెలియడంతో సీఎం తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కూలీ పనులకు వెళ్లి ఇంటికి వచ్చే సమయంలో మృత్యువాత పడటం బాధాకరమని అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గాయపడిన వారికి నాణ్యమైన వైద్య చికిత్స అందించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు.

## తల్లికి వందనం డబ్బులు తిరిగి ఇచ్చేసిన ఓ మహిళ

పేదరికం కారణంగా ఏ విద్యార్థి చదు వుకు దూరం కాకూడదనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం తల్లి వందనం పథకాన్ని అమలు చేస్తోంది. మరింత ఉన్నతంగా ఆలోచించిన ఓ మాతృమూర్తి ఆ డబ్బుల్ని బిడ్డ చదువుతున్న పాఠశాల బాగుకే విని యోగించాలని తిరిగి ఇచ్చేశారు. ఈ ఆదర్శ ఘటన గార మండలం కళింగ పట్నం – మత్స్యలేశం ప్రభుత్వ ప్రాథమి కోన్నత పాఠశాలలో జరిగింది. గ్రామానికి చెందిన ఓ మహిళ తన కుమారుడు స్థానిక పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. ఆమెకు తల్లి వందనం పథకం కింద ప్రభుత్వం రూ.13 వేలు ఇచ్చింది. ఆ మొత్తానికి మరో రూ.2 వేలు కలిపి మొత్తం రూ.15 వేలు పాఠశాల అభివృద్ధికి వినియోగించాలని తిరిగి ఇచ్చేశారు. 'ప్రభుత్వం మా అబ్బాయి చదువుకునేందుకు అన్ని సౌకర్యాలు సమ కూరుస్తోంది. ఏకరూప దుస్తులు, బూట్లు ఇచ్చింది. మధ్యాహ్నం భోజనం పెడుతు న్నారు. అవి చాలు. ఈ డబ్బులు అవ సరం లేదు. పాఠశాల అభివృద్ధికి వాటిని వినియోగించండి' అని ఈ నెల 10న పాఠశాలలో జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం అనంతరం ప్రధానోపాధ్యాయుడు సుధీరకు అందజే శారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో చక్కెర్లు కొడుతోంది.

# మళ్లీ తెరపైకి కేబినెట్ విస్తరణ

**హైదరాబాద్ :** తెలంగాణ కాంగ్రెస్ లో రాజకీయాలు నిరంతరం వేడిపుట్టిస్తూనే ఉంటాయి. మంత్రి వర్గ విస్తరణ అధినాయకత్వం ఎలాగోలా పూర్తి చేసింది. రేవంత్ రెడ్డి కేబినెట్ లో మొన్నటి వరకూ మొత్తం ఆరు పోస్టులు ఖాళీగా ఉండగా అందులో మూడింటిని మాత్రమే భర్తీ చేశారు. ఎస్సీలో మాల, మాదిగ సామాజికవర్గానికి చెందిన నేతలతో పాటు బీసీ సామాజికవర్గానికి చెందిన నేతకు ఇచ్చారు. మంత్రివర్గం విస్తరణ జరిగిన వెంటనే కొంత అసంతృప్తులు బయటకు వచ్చినప్పటికీ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్ ఛార్జి మీనాక్షినటరాజన్ లు అసంతృప్త నేతలను బుజ్జగించారు. స్థానికసంస్థల ఎన్నికల తర్వాత మిగిలిన మూడు పోస్టులను భర్తీ చేస్తామని పార్టీ హైకమాండ్ చెబుతుంది. అయితే తనకు మంత్రి పదవి దక్కని నేతలు మాత్రం పార్టీ కార్యక్రమాలకు దూరంగానే ఉంటున్నారు. తమ నియోజకవర్గానికి మాత్రమే పరిమితమవుతున్నారు. అంతే తప్ప తాము రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై వారు స్పందించడం లేదు. భవిష్యత్ లోనూ మంత్రి పదవి దక్కతుందన్న గ్యారంటీ మాత్రం లేదని తెలిసిన తర్వాత పూర్తిగా నిరుత్సాహంలో పడిపోయారు. అందులో ప్రధానంగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఒకరు. ఆయన తనకు మంత్రి పదవి తప్పకుండా వస్తుందని భావించారు. ఎన్నికలకు ముందు బీజేపీ నుంచి కాంగ్రెస్ లో చేరిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మునుగోడు నుంచి పోటీ చేసి విజయం సాధించారు. అయితే అనేక కారణాల వల్ల ఆయనకు మంత్రి పదవి దక్కలేదు.. తనకు మంత్రి పదవి వస్తుందని, హోంమంత్రి పదవి ఆశిస్తున్నట్లు కూడా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మీడియా చిట్ చాట్ లో అన్నారంటే ఆయన ఎంత కాన్ఫిడెన్స్ గా ఉన్నారో అర్థమవుతుంది. తనతో పాటు బీజేపీ నుంచి కాంగ్రెస్ లో చేరిన గడ్డం వివేక్ కు మంత్రి పదవి దక్కినా తనకు దక్కకపోవడానికి ప్రధాన కారణం రెడ్డి సామాజికవర్గమేనని అందరికీ తెలుసు. దీంతో పాటు జిల్లా కూడా ఒక కారణం. ఇప్పటికే నల్లగొండ జిల్లా నుంచి తన సోదరుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డితో పాటు ఉత్తమ్




కుమార్ రెడ్డి కూడా ఉన్నారు. మరో పదవి ఇవ్వాలంటే ఒక కుటుంబంలో ఇద్దరికి అనేది పార్టీ హైకమాండ్ కు కూడా ఇబ్బందికరంగా మారింది. అందువల్లనే మొన్న మంత్రి వర్గ విస్తరణలో రెడ్డి సామాజికవర్గాన్ని పూర్తిగా పక్కన పెట్టేశారు.. ఇక ఇప్పుడు త్వరలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక జరగనుంది. మంత్రివర్గంలో ముస్లిం సామాజికవర్గానికి చెందిన వారు లేరు. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత రానున్న మూడు పోస్టులు కూడా ప్రాంతాల వరంగా, సామాజికపరంగా ఇతరులకు కేటాయించే అవకాశముందన్న సమాచారం అందడంతోనే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సైలెంట్ గా ఉన్నారని తెలిసింది. అయితే స్థానిక సంస్థల ఎన్నికల వరకూ కొంత సంయమనాన్ని పాటించి తర్వాత రాజగోపాల్ రెడ్డి తన అసంతృప్తిని బహిరంగంగా వెళ్ల గక్కే అవకాశముంది. చూస్తుంటే ఆ మూడు పోస్టులను కూడా ఇతర సామాజికవర్గాలకు, బలహీనవర్గాలకు కేటాయించి రెడ్ల వివాదానికి ఫుల్ స్టాప్ పెట్టేయాలన్న యోచనలో హైకమాండ్ ఉన్నట్లు తెలిసింది. మొత్తం మీద మంత్రి పదవులపై ఆశలు పెట్టుకున్న రెడ్డి సామాజికవర్గం నేతలకు మాత్రం ఈసారి కూడా ఆశాభంగమే ఉంటుందన్న కామెంట్స్ వినపడుతున్నాయి.

## దళిత మహిళను వేధిస్తున్న పాములపాడు మండల వెలుగు ఏ పి ఎం ఉమామహేశ్వరమ్మ

**శ్రీశైలం :** నంద్యాల జిల్లా పాములపాడు మండలం మద్దూరు గ్రామంలోని శ్రీ వెంకట సాయి గ్రామైక్య సంఘంలో గత నాలుగు సంవత్సరాల నుండి వివోఏ గా బుక్ కీపర్ గా పనిచేస్తున్న మద్దెల ప్రియాంక అను నన్ను ఏపిఎం ఉమామహేశ్వరమ్మ గారు రాజీనామా చేయమని గత ఐదు నెలల నుండి వేధింపులకు గురిచేస్తూ ఒత్తిడి చేస్తుంది. దీనికి కారణం నాపైన ఎటువంటి అభియోగాలు లేవు అయినా గాని రాజకీయ నాయకుల ఒత్తిడికి తలోగ్గి నాపై బలవంతంగా ఒత్తిడి చేస్తూ రాజకీయ నాయకుల కాళ్లు మొక్కి నీ పోస్టు కాపాడుకో లేదంటే నిన్ను బుక్కీపర్ నుండి తొలగిస్తాము అని బెదిరిస్తున్నది కావున దీనిపైన గ్రామైక్య సంఘంలోని పొదుపు సంఘాలతో విచారణకు పై స్థాయి అధికారిని నియమించడం జరిగింది. ఆ అధికారి గ్రామంలోని 16 సంఘాల సభ్యులతో సమావేశమై విచారించింది ఈ విచారణలో భాగంగా సభ్యులందరూ ప్రస్తుతం పని చేస్తున్న బుక్ కీపర్ మద్యల ప్రియాంక బాగా పనిచేస్తున్నది ఆమెనే మాకు కొనసాగించాలని ఏకగ్రీవంగా సభ్యులు ఓ బీలు అందరూ తీర్మానించడం జరిగింది ఈ తీర్మానాలను కూడా ఖాతరు చేయకుండా ఏపీఎం ఉమామహేశ్వరమ్మ గారు ప్రియాంక అను నన్ను రాజీనామా చేయాలని ఉద్దేశపూర్వకంగా మానసిక క్షోభకు గురిచేస్తూ ఒత్తిడి తీసుకొస్తుంది నేను ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినాను పాములపాడు ఎస్ఐ గారికి ఎస్పీ గారికి విషయాన్ని తెలియజేయగా ఎస్పీ గారు డిఎస్పి గారి దగ్గరికి పంపించారు నేను గౌరవ డిఎస్పి ఆత్మకూరు వారిని కలవడం జరిగింది అయినా కానీ నాకు న్యాయం జరగలేదు. కావున ప్రియాంక అను నేను ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ కుల సంఘాల ప్రజాసంఘాల దృష్టికి తీసుకెళ్లాను ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ప్రియాంకకు మద్దతుగా ప్రకటించారు పాములపాడు ఏపీఎం ఉమామహేశ్వరిని సస్పెండ్ చేసి ఆమెపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి బాధితురాలైన దళిత మహిళ మద్దెల ప్రియాంకకు న్యాయం చేయాలని డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ తాలూకా ఇన్చార్జి మరియు ఎంఎస్పి నంద్యాల జిల్లా అధికార ప్రతినిధి కోట ప్రభాకర్ మాదిగ జాతీయ మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు నల్లమల్ల అబ్రహం గారు నంద్యాల జిల్లా ఎంఆర్పిఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కనకం నాగరాజు ఎమ్మార్పీఎస్ పాములపాడు మండల అధ్యక్షుడు బొల్లెద్దుల మోహన్ ఎంఎస్పి మండల అధ్యక్షుడు శ్రీ జడల శ్రీనివాసులు బీసీ సంఘం మండల నాయకులు ఎల్ల గౌడ్ మరియు మాల మహానాడు మండల ప్రెసిడెంట్ బేతి పుల్లయ్య ఎంఆర్పిఎస్ జూపాడుబంగ్లా మండల ఇన్చార్జి అడ్డాకుల ప్రసాదు మరియు చవిటి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## రోజుల్లో 30 పుణ్యక్షేత్రాలు

**హైదరాబాద్ :** దేశంలో ఎన్నో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. వీటిని లైఫ్‌లో ఒక్కసారైనా కూడా చూడాలని భావిస్తారు. అయితే ఒక్కో పుణ్యక్షేత్రానికి వెళ్లడానికి కష్టం. అన్నింటిని కూడా ఒక ట్రిప్‌లో పూర్తి చేయాలని అనుకుంటారు. ముఖ్యంగా ప్రముఖ పుణ్య క్షేత్రాలైన అయోధ్యతో పాటు దాని చుట్టూ ఉన్న ఆలయాలను సందర్శించాలని భావిస్తారు. అలాంటి వారికి ఐఆర్‌సీటీసీ బెస్ట్ ప్యాకేజీని అందిస్తోంది. ఈ ప్యాకేజీలో మొత్తం 17 రోజుల్లో 30 పుణ్యక్షేత్రాలను సందర్శించవచ్చు. ఈ యాత్ర జులై 25వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఈ టూర్‌లో అయోధ్యతో పాటు వారణాసి, ప్రయాగ్‌రాజ్, నాసిక్, రామేశ్వరం వరకు ఈ టూర్ ఉంటుంది. మొత్తం 150 మంది ప్రయాణికులతో భారత్ గౌరవ్ డీలక్స్ ఏసీ టూరిస్ట్ ట్రైన్‌లో యాత్రకు తీసుకెళ్తారు. ఈ యాత్రకు ఒక్కో ప్రయాణికుడి నుంచి రూ.1,15,180 ఛార్జ్ చేస్తారు. ఈ ప్యాకేజీలో ఏసీ 3 టైర్‌లో హోటల్ గదుల్లో ట్రిపుల్ షేర్ అయితే రూ.1,15,180, డబుల్ షేర్ అయితే రూ.1,17,975, సింగిల్ షేర్ అయితే రూ.1,37,545 ఛార్జ్ చేస్తారు. అదే ఏసీ 2 టైర్ అయితే ట్రిపుల్ షేర్‌లో రూ.1,37,325, డబుల్ షేర్ రూ.1,40,120, సింగిల్ షేర్ అయితే రూ.1,59,690 అవుతుంది. ఏసీ 1 టైర్ అయితే రూ.1,63,585 కి ట్రిపుల్ షేర్, డబుల్ షేర్ అయితే రూ.1,66,380, సింగిల్ షేర్ అయితే రూ.1,85,950 అవుతుంది. అదే 5 ఏళ్ల నుంచి 11 ఏళ్ల పిల్లలకు టికెట్ ధర అయితే రూ.1,07,615 ఐఆర్‌సీటీసీ తీసుకుంటుంది.

## అన్నమయ్య జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

అన్నమయ్య : అన్నమయ్య జిల్లాలో ఆదివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రాజంపేట నుంచి రైల్వేకోడూరు మార్కెట్ కు మామిడి కాయల లోడ్తో ఓ లారీ బయల్దేరింది. 16 మంది మామిడి కాయలు కోసే కూలీలు లారీపై కూర్చున్నారు. రెడ్డిపల్లె చెరువు కట్ట మీదకు రాగానే లారీ అదుపు తప్పి బోల్తా పడింది. కూలీలంతా లారీ కింద ఇరుక్కుపోయారు. అందులో ఏడుగురు మృతి చెందారు. కొంతమందికి తీవ్రగాయాలు అయ్యాయి.

# ఆరాంఘర్ లో ఆర్టీసీ బస్ స్టేషన్...

హైదరాబాద్ : హైదరాబాద్‌లో రాష్ట్ర, అంతర్రాష్ట్ర బస్సుల కోసం మరో భారీ బస్ టెర్మినల్ అందుబాటులోకి రానుంది. మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపేట, గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే అంతర్రాష్ట్ర బస్సుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ ఇంటర్‌స్టేట్ బస్ టెర్మినల్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ప్రస్తుతం పొరుగు రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే బస్సులు నగరంలో ట్రాఫిక్‌జామ్ సమస్యల కారణంగా ఎంజీబీఎస్‌కు (మహాత్మా గాంధీ బస్ స్టేషన్) ఆలస్యంగా చేరుకుంటున్నాయి. ఈ సమస్యకు పరిష్కారంగా ఆధునిక బస్ టెర్మినల్ ఏర్పాటుకు ఆర్టీసీ అధికారులు ప్రణాళిక రూపొందించారు. జాతీయ రహదారి 44కు పక్కనే ఆరాంఘర్‌లో 7.22 ఎకరాల స్థలాన్ని ఆర్టీసీ గుర్తించింది. ఈ స్థలంలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ వెల్ఫేర్ (ఐసీఎస్‌డబ్ల్యూ) భవనాలున్నాయి. వాటికి పరిహారంగా రూ. 6 కోట్లు చెల్లించేందుకు ఆర్టీసీ ముందుకు వచ్చింది. ఈ భూమిని ఆర్టీసీ బస్ టెర్మినల్‌కు కేటాయించాలని కోరుతూ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ 2025 జనవరి 25న రెవెన్యూశాఖకు లేఖ రాశారు. అయితే ఆరు నెలలు దాటినా ఈ అంశం ఇంకా కొలిక్కిరాలేదు. ఈ భూకేటాయింపు ప్రతిపాదన రంగారెడ్డి కలెక్టరేట్‌లో పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే నగరంలో ఇంటర్‌స్టేట్ బస్ టెర్మినల్ ఏర్పాటుకు అడుగు పడుతుంది. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో రెండు ప్రధాన భారీ బస్ టెర్మినల్స్ ఉన్నాయి మహాత్మా గాంధీ బస్ స్టేషన్ హైదరాబాద్‌లోని అతిపెద్ద, ముఖ్యమైన బస్ స్టేషన్లలో ఒకటి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు, అలాగే పొరుగు రాష్ట్రాలకు వెళ్లే బస్సులకు ఇది ప్రధాన కేంద్రం. ప్రతిరోజు లక్షలాది మంది ప్రయాణికులు దీని ద్వారా రాకపోకలు సాగిస్తారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ సమీపంలోని జుబ్లీ బస్ స్టేషన్ ప్రధానంగా ఉత్తర తెలంగాణ జిల్లాలైన కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సులకు సేవలందిస్తుంది. కొత్త బస్ టెర్మినల్ అందుబాటులోకి వస్తే దక్షిణ తెలంగాణ జిల్లాల నుండి వచ్చే బస్సులకు, అలాగే ఆంధ్రప్రదేశ్, కర్ణాటకల నుండి వచ్చే బస్సులకు ట్రాఫిక్ రద్దీ తగ్గుతుంది. ఇది ప్రయాణికులకు కూడా సమయం ఆదా అవుతుంది.

## పేర్ని నానిపై పోలీసులకు పిర్యాదు



**మచిలీపట్నం :** మచిలీపట్నం టీడీపీ నేతలు వైసీపీ మాజీ మంత్రి పేర్ని నానిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన పేర్ని నానిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే పేర్ని నాని బహిరంగంగా చీకట్లో కన్ను కొడితే పనులు అయిపోవాలి. జగన్ 2.0 ప్రభుత్వంలో కార్యకర్తలకు ఫ్రీ హ్యాండ్ ఉంటుంది. అప్పటి వరకూ రప్పా రప్పా బంద్ చేయాలి. చీకట్లో చేయాల్సిన పనులు పట్టపగలు మాట్లాడుకుంటామా?' అంటూ సంచలన వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.

## భూకబ్జాలకు పాల్పడిన వారు ఎవరైనా కఠిన చర్యలు తప్పవు

### - బద్వేలు టిడిపి ఇన్చార్జి రితేష్ రెడ్డి

బద్వేలు : బద్వేల్ నియోజకవర్గంలో గత కొంతకాలంగా పేదల భూములపై దృష్టిసారించిన ముఠా? ఫోర్జరీ పత్రాలతో అమాయకుల భూముల కబ్జాకు పాల్పడుతోంది. ఇటీవలి కాలంలో బద్వేల్ పోలీసులు వీరిని అరెస్ట్ చేయడం జరిగింది, ఈ ఘటన పై స్పందిస్తూ ఈ దోపిడీపై తాను మొదటినుంచే పోరాటం చేస్తున్నానని టీడీపీ బద్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రితేష్ రెడ్డి పేర్కొన్నారు. తాను నియోజకవర్గంలో పాదయాత్ర చేస్తున్న సమయంలోనే గత ప్రభుత్వ హయాంలో అనేక భూములు కబ్జా చేయబడ్డాయని వాటిని తిరిగి వారికి అందేలా చూస్తానని ప్రజలకు హామీ ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. పేదల ఆస్తులను దోచుకుని దౌర్జన్యానికి పాల్పడిన వారిని ఎంతటి వారైనా... ఏ స్థాయి వారైనా కూటమి ప్రభుత్వం ఏ మాత్రం ఉపేక్షించదు అని రితేష్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి పారదర్శక విచారణ జరిపి, నిందితులకు తగిన శిక్షలు విధించాలని సంబంధిత అధికారులను ఆయన కోరారు. బద్వేల్ ప్రజల ఆస్తులు భద్రంగా ఉండేలా కూటమి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందని, ఇది మంచి పరిపాలనకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

Edited, Published and Owned by **Ramancharla Srikanth** & Printed by **V. Raj Kumar** at **RK PRINTERS**, # 1-7-210/2, Kamala Nagar, Opp ECIL Bus Stop, ECIL, Hyderabad, Telangana - 500062 & Published from Sri Lakshmi Narsimha Colony, Flat No.106. Balaji Nagar, Kapra, Medchal Dist., Telangana - 500087. **RNI No.: TELTEL/2023/90269**. Editor: **RAMANCHARLA SRIKANTH**, Mob: **9963708331**, Email: telanganashaan331@gmail.com